బలగం
BALAGAM TV
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 16 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4

## తెలంగాణలో ప్రవేశ పరీక్షల తేదీలు ఖరారు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో నిర్వహించనున్న వివిధ ప్రవేశ పరీక్షల తేదీలను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. ఏప్రిల్ 29 నుంచి ఈఏపీసెట్ జరగనుంది. ఏప్రిల్ 29, 30 తేదీల్లో ఈఏపీసెట్ (అగ్రికల్చర్, ఫార్మసీ) పరీక్షలు జరగనున్నాయి. మే 2 నుంచి 5 వరకు ఈఏపీసెట్ (ఇంజినీరింగ్) పరీక్షలను నిర్వహించనున్నారు. మే 12న ఈసెట్, జూన్ 1న ఎడ్‌సెట్, జూన్ 6న లాసెట్, పీజీఎల్ సెట్, జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్, జూన్ 16 నుంచి 19 వరకు పీజీఈసెట్ పరీక్షలు జరగనున్నాయి.

## తెలంగాణకు నీటి కేటాయింపుల విషయంలో

# బలమైన వాదనలు వినిపించాలి



- ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ-1956 సెక్షన్ 3ని పరిగణనలోకి తీసుకోవాలి...
- గోదావరి-బనకచర్లపై అభ్యంతరాలతో జల్‌శక్తి మంత్రి, ఏపీ ముఖ్యమంత్రికి లేఖలు
- పోలవరం ముంపుపై నిర్దేశిత సమయంలో ఐఐటీతో అధ్యయనం
- నీటి పారుదల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణకు అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ)-1956 సెక్షన్ 3 ప్రకారం నీటి కేటాయింపులు చేపట్టాలనే విషయంపై కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-II(కేడబ్ల్యూడీటీ-II) ఎదుట బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం (ఏపీఆర్ఏ)-2014లోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఏపీఆర్ఏ ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌనిల్ సైతం సెక్షన్ 3 ఆధారంగా నీటి పంపకాలు రెండు రాష్ట్రాల మధ్య చేపట్టాలని సూచించిందని సీఎం తెలిపారు. కేడబ్ల్యూడీటీ-%క్ష్మీక్ష్మీ% తదుపరి విధివిధానాలపై (ఫర్దర్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా అత్యున్నత న్యాయస్థానం ఎటువంటి స్టే ఇవ్వని విషయాన్ని సీఎం గుర్తు చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటి పారుదల శాఖ) ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేప్టటడంపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు (జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ) తెలంగాణ తరఫున అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రమైనా ఏ నదిపైనైనా ప్రాజెక్టు నిర్మించాలంటే జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీలతో పాటు పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలనే విషయాన్ని లేఖల్లో ప్రస్తావించాలని సీఎం సూచించారు. పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలం ముంపు విషయంపై హైదరాబాద్ ఐఐటీతో అధ్యయనం చేయించే అంశాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమ్మక్క సారక్క బ్యారేజీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం సూచించారు.


## శబరిమలలో మకరజ్యోతి దర్శనం... పులకించిన భక్తులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేరళ శబరిమల అయ్యప్పస్వామి ఆలయం వద్ద పొన్నాంబలమేడు కొండల్లో మంగళవారం మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో శబరిమల అయ్యప్పస్వామి ఆలయం శరణుఘోషతో మార్మోగింది. తిరువాభరణా ఘట్టం పూర్తయ్యాక పొన్నాంబల మేడులో కందమల శిఖరంపై మకరజ్యోతి రూపంలో అయ్యప్ప భక్తులకు దర్శనమిచ్చారు. దీనితో హరిహర సుతుడైన స్వామి అయ్యప్పను స్మరిస్తూ స్వామియే శరణం అయ్యప్ప అన్న శరణుఘోషలతో శబరిగిరులు ప్రతిధ్వనించాయి.


సంక్రాంతి పండుగ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పొన్నాంబలమేడు కొండల్లో మకర జ్యోతి దర్శనమిచ్చింది. ఈ జ్యోతిని స్వామివారి అంశగా భావించే అయ్యప్ప భక్తులు ఈ దృశ్యాన్ని చూసి పరవశించిపోయారు. కాగా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా శబరిమల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.





## 3 యుద్ధనౌకలను జాతికి అంకితం చేసిన మోడీ

- రెండు యుద్ధ నౌకలు, ఒక జలాంతర్గామి
- ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్- నీలగిరి, ఐఎన్ఎస్ వాఘ్‌షేర్ యుద్ధనౌకలు..





**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

భారత వాయుసేనలోకి మరో మూడు యుద్ధనౌకలు చేరాయి. అధునాతన ఐఎన్ఎస్ సూరత్, జలాంతర్గామి ఐఎన్ఎస్ నీలగిరి, ఐఎన్ఎస్ వాఘ్ షీర్ యుద్ధనౌకలను ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో ప్రధాని మోడీ బుధవారం ప్రారంభించారు. ఈ నౌకలను మోడీ జాతికి అంకితం చేశారు. ఈ యుద్ధనౌకలతో భారత నేవీ బలం మరింత పెరగనుంది. రక్షణ తయారీ, సముద్ర భద్రతలో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలనే భారతదేశ కలను సాకారం చేయడంలో ఇది ఒక ముందడుగుగా నిపుణులు వెల్లడించారు. సముద్ర జలాల్లో గస్తీని పెంచడం, ఎలాంటి సంక్లిష్ట పరిస్థితులనైనా ధీటుగా ఎదుర్కొనేలా రూపుదిద్దుకుంటోంది. చైనా దక్షిణ సముద్ర తీర ప్రాంతం నుంచి ముప్పు పొంచివున్న ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత శక్తిమంతమైన మూడు యుద్ధనౌకలు బరిలోకి దిగాయి.

తొలుత- నౌకాదళాధికారులను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. భారత్- ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని, ఈ క్రమంలో రక్షణ మంత్రిత్వ శాఖను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశ మ్యానుఫ్యాక్చరింగ్, ఎక్స్‌పోర్ట్స్ సామర్థ్యం రెట్టింపు అవుతోందని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో దలాది కొత్త నౌకలు, కొత్త కంటైనర్లు అవసరమౌతాయని మోదీ పేర్కొన్నారు. వాటిని తయారు చేసుకునే క్రమంలో దేశవ్యాప్తంగా గల అన్ని పోర్టులు కూడా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఊతమివ్వబోతోన్నాయని అన్నారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని అన్నారు. జనావాసాలకు దూరంగా ఉంటూ వస్తోన్న దీవులను కూడా అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యతను ఇస్తోన్నామని మోదీ చెప్పారు.

ప్రపంచంలో బలమైన శక్తిగా భారత్ మారుతోందన్నారు. భద్రమైన సముద్ర మార్గాల కోసం ప్రయత్నిస్తున్నామని, ఈ మూడు మేడిన్ ఇండియావి అని అన్నారు. తాము విస్తరణవాదంతో కాదు.. వికాసవాదంతో పనిచేస్తామని చెప్పారు. రక్షణ రంగంలో మేకిన్ ఇండియా ఆవిష్కృతం అవుతోందన్నారు. అలాగే, వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్ అని అన్నారు. ఈ మూడు యుద్ధ నౌకలు భారత్‌కు మరింత శక్తినిస్తాయి అని చెప్పుకొచ్చారు.

అంతర్జాతీయ కార్గో మార్గాలను భారత్ కాపాడుతోందన్నారు. నేవీ బలోపేతం వల్ల ఆర్థిక ప్రగతి కూడా కలుగుతుందన్నారు. ఐఎన్ఎస్ సూరత్.. పీ15బీ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక అని చెప్పారు. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధనౌకల్లో ఇదొకటి అని, ఇందులో స్వదేశీ వాటా 75 శాతం ఉందని వెల్లడించారు. ఈ యుద్ధనౌకలో అధునాతన ఆయుధ-సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయన్నారు. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతమని చెప్పారు. ఐఎన్ఎస్ నీలగిరి.. పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక అని తెలిపారు. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో దీన్ని తయారుచేశారని వివరించారు. ఐఎన్ఎస్ వాఘ్ షీర్.. పీ75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి అని అన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారని, ఐఎన్ఎస్ సూరత్ పొడవు 164 మీటర్లు. 1565 టన్నుల సామర్థ్యం కలిగి ఉందని ప్రధాని మోడీ తెలిపారు.

## ఎన్నికల కమిషన్‌కు సుప్రీంకోర్టు నోటీస్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎన్నికల నిర్వహణకు సంబంధించి 1961వ సంవత్సరపు నిబంధనల్లో చేసిన సవరణను సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత జైరాం రమేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు బుధవారం ఎలక్షన్ కమిషన్‌కు నోటీసు జారీ చేసింది. ఎన్నికలకు సంబంధించిన పత్రాల పరిశీలనను నిబంధనల్లో పేర్కొన్న డాక్యుమెంట్లకు మాత్రమే పరిమితం చేయడాన్ని ఆయన సవాలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి సంజరు కుమార్‌తో కూడిన బెంచ్ స్పందిస్తూ ఎన్నికల కమిషన్‌కు నోటీసు జారీ చేసింది. మార్చి 17తో ప్రారంభమయ్యే వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను గత నెలలో న్యాయ మంత్రిత్వ శాఖ సవరించింది. ఇటీవల జరిగిన హర్యానా శాసనసభ ఎన్నికలకు సంబంధించిన అన్ని పత్రాలను న్యాయవాది మెహమూద్ ప్రచాకు అందజేయాలని పంజాబ్-హర్యానా హైకోర్టు గతంలో ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఆ తర్వాత కమిషన్‌తో చర్చించిన న్యాయ శాఖ ఈ సవరణను తీసుకొచ్చింది.

## తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జిలు..!

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులకు జడ్జిలుగా పలువురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. తెలంగాణ హైకోర్టుకు నలుగురు, ఏపీ హైకోర్టుకు ఇద్దరి పేర్లను సిఫారసు చేసింది సుప్రీంకోర్టు కొలీజియం. తెలంగాణ హైకోర్టుకు వై రేణుక, నందికొండ నర్సింగరావు, తిరుమల దేవి, మధుసూదన్ రావు, ఏపీ హైకోర్టుకు హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు పేర్లను సిఫారసు చేసింది. జ్యుడిషియల్ ఆఫీసర్ల కోటాలో ఈ ఆరుగురు పేర్లను కొలీజియం సిఫారసు చేసినట్లు తెలుస్తోంది.

## కేటీఆర్‌కు షాక్

- హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోబోమన్న సుప్రీంకోర్టు
- క్వాష్ పిటిషన్ వెనక్కి తీసుకున్న కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



సుప్రీంకోర్టులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు షాక్ తగిలింది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను విచారణకు సుప్రీం కోర్టు అంగీకరించలేదు. హైకోర్టు ఆదేశాల్లో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు చెప్పటంతో కేటీఆర్ తాను దాఖలు చేసిన పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకుంది. బుధవారం ఉదయం కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఫార్ములా ఈ రేస్ కేసు విచారణ ప్రాథమిక దశలో ఉందని చెబుతూ హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోబోమని వ్యాఖ్యానించింది. అయినప్పటికీ మీకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి కదా? అంటూ కేటీఆర్ తరపు న్యాయవాదికి గుర్తుచేసింది. దీంతో క్వాష్ పిటిషన్ ను వెనక్కి తీసుకోవడానికి అనుమతించాలని కేటీఆర్ న్యాయవాది కోరగా.. సుప్రీం ధర్మాసనం అంగీకరించింది. దీంతో కేటీఆర్ తన పిటిషన్ ను ఉపసంహరించుకున్నారు. ఫార్ములా ఈ రేసులో అవినీతి జరిగిందని కేటీఆర్ పై సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

### నేడు ఈడీ విచారణకు కేటీఆర్

ఎమ్మెల్యే కేటీఆర్ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల విచారణకు హాజరుకానున్నారు. ఈ నెల 7న మరోసారి నోటీసులు ఇచ్చిన ఈడీ అధికారులు.. 16న తమ ఎదుట విచారణకు హాజరుకావాలని చెప్పిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఉదయం 10 గంటలకు నందినగర్‌లోని తన నివాసం నుంచి కేటీఆర్ ఈడీ కార్యాలయానికి బయల్దేరనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఎల్బీ స్టేడియం ఎదురుగా ఉన్న ఈడీ కార్యాలయానికి కేటీఆర్ చేరుకుని విచారణకు హాజరు కానున్నారు.

## లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

- రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు పథకాలకు అర్హులైన లబ్ధిదారులను సమర్థవంతంగా గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలి
- సి.ఎస్ శాంతి కుమారి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ఈనెల 21వ తేదీ నుండి నిర్వహించే గ్రామ సభలలో ఆమోదం పొందాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈనెల 26 వ తేదీన ప్రారంభించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు తగు కార్యాచరణపై జిల్లా కలెక్టర్లతో నేడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ నాలుగు ప్రతిష్టాత్మక పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఏవిధమైన అపోహలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ పథకాలన్నీ నిజమైన అర్హులకే దక్కేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రైతు భరోసాకు సంబంధించి భూముల వివరాలను రెవిన్యూ శాఖ ద్వారా వ్యవసాయ శాఖకు పంపడం జరిగిందని, సాగుయోగ్యంకానిభూములను క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించాలని అన్నారు. సంయుక్త సందర్శనలు నిర్వహించి, గ్రామసభల్లో వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు ప్రదర్శించి, చదివి వినిపించి ఆమోదం పొందాలని ఆదేశించారు.


ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి, ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాల జాబితాను, గ్రామ సభల్లో ప్రకటించి ఆమోదం పొందాలని సి.ఎస్ తెలిపారు.రేషన్ కార్డుల మంజూరీకై రూపొందించిన లబ్ధిదారుల ముసాయిదా జాబితా గ్రామసభల్లో ఆమోదం పొందాలన్నారు. ఇదేవిధంగా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శక సూత్రాల ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారుల ముసాయిదా జాబితా ను గ్రామాలలో ప్రదర్శించాలనిఅన్నారు. గ్రామీణ ప్రాంతాలలో, గ్రామపంచాయతీల వారిగా మరియు పట్టణ ప్రాంతాల్లో వార్డుల వారిగా సభలు నిర్వహించాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, లబ్ధిదారుల జాబితా ఎంపిక, డాటా ఎంట్రీ, క్షేత్ర స్థాయి వెరిఫికేషన్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ను ఆదేశించారు.

ఇప్పటివరకు, ఈ నాలుగు పథకాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన, ప్రత్యేక బృందాల ఏర్పాటు, ముసాయిదా జాబితా తయారీ, డేటా ఎంట్రీ ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు చేసిన ప్రత్యేక శ్రద్ధని సి.ఎస్ అభినందించారు. ఈ నాలుగు పథకాల అమలుకై రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అనుగుణంగా అమలయ్యేలా సంబంధిత కార్యదర్శులు పర్యవేక్షించాలని సి.ఎస్. శాంతి కుమారి ఆదేశించారు.

ఈ టెలి కాన్ఫరెన్స్ లో రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శిడి.ఎస్. చౌహాన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసి కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ఆలయాల్లో బ్రహ్మానందం ప్రత్యేక పూజలు

**బలగం టీవి, కరీంనగర్**



ప్రముఖ టాలీవుడ్ నటుడు, కమెడియన్ బ్రహ్మానందం సంక్రాంతి పండుగ వేళ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు బ్రహ్మానందం. ఈ సందర్భంగా ఆయా ఆలయాల పూజారులు బ్రహ్మానందంను ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని బ్రహ్మానందం సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. బుధవారం గిద్దె పేరుమాండ్ల ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయ పూజారి శంకర శర్మ.. బ్రహ్మానందం చేత ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కరీంనగర్‌లోని తమ బంధువుల ఇంటికి.. సంక్రాంతి పండుగకు వచ్చినట్లు బ్రహ్మానందం తెలిపారు. ఈ నేపథ్యంలో ఆలయాలను కూడా సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభం




**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**


రాష్ట్రంలోని నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ మంగళవారం సంక్రాంతి కానుకగా ప్రారంభించారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరిగిన ఈ ఓపెనింగ్ కార్యక్రమంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి, కేంద్రమంత్రి బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. దేశ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయాలన్న ఎంపీ అర్వింద్, కేంద్రమంత్రి బండి సంజయ్ కోరికను సంక్రాంతి పండుగ రోజున తీర్చామన్నారు. దేశంలోని 20 రాష్ట్రాల పసుపు రైతులకు ప్రధాని మోడీ పండుగ కానుక ఇచ్చారన్నారు. ప్రధాని మోడీ ఏదైనా హామీ ఇస్తే కచ్చితంగా నేరవేర్చుతారని.. అం దుకే ఇదే సాక్ష్యమని పేర్కొన్నారు. పసుపు రైతులకు బోర్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నిజామా బాద్ లో పసుపు బోర్డు ఏర్పాటుకు అర్వింద్, బండి సంజ య్ చాలా కృషి చేశారని పేర్కొన్నారు. పసుపు రైతులకు అన్ని విధాలా బోర్డు మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.

నిజామాబాద్‌కు చెందిన బీజేపీ నేత పల్లె గంగారెడ్డిని జాతీయ పసుపు బోర్డు చైర్మెన్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన రోజు నుండి ఆయన మూడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామానికి చెందిన రైతు పల్లె గంగారెడ్డి ప్రస్తుతం బీజేపీలో సీనియర్ నేతగా, రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

## దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తోన్న ఆర్ఎస్ఎస్

- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



దేశ స్వాతంత్ర్యం, అయోధ్య రామ మందిర ప్రతిష్ఠాపన గురించి చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలును కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠాపన జరిగిన రోజునే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభించిందని భగవత్ వ్యాఖ్యానించడం నిజంగా దురదృష్టకరం అన్నారు. ఆయన వ్యాఖ్యలను దేశ ద్రోహంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. ఈ సందర్భంగా మాట్లాడారు.

దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతుందన్నారు. అందులో తమది రాజ్యాంగ సిద్ధాంతం కోసం జరుగుతుంటే, మరొకటి ఆర్ఎస్ఎస్ భావజాల సిద్ధాంతం కోసం జరుగుతుందన్నారు. రామ మందిరం ప్రతిష్టాపన రోజే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పడం నిజంగా స్వాతంత్ర్య సమరయోధులను కించపరచడమే అవుతుందన్నారు. ఇకపైనా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. అటు ఎన్నికల కమిషన్ సైతం అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తుందని రాహుల్ విమర్శించారు. లోక్ సభ ఎలక్షన్స్ తో పోల్చితే అసెంబ్లీ సమయానికి మహారాష్ట్రలో పెద్ద సంఖ్యలో ఓట్లు పెరిగాయన్నారు. ఓట్లు ఎలా పెరిగాయో చెప్పాలంటే సమాచారం ఇవ్వడం లేదన్నారు.ఇప్పటికైనా ఎన్నికల సంఘం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని రాహుల్ సూచించారు.

**కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించిన సోనియా గాంధీ**

ఢిల్లీలో నిర్మించిన నూతన కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ కేంద్ర కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యాలయ ప్రారంభోత్సవ వేడుకలో రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయానికి 'ఇందిరాగాంధీ భవన్' అని పేరు పెట్టారు.

## గాలిపటాలు ఎగురవేస్తుండగా..
### భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతి

**బలగం టీవి, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా కాటేదాన్ లో బుధవారం విషాదం చోటుచేసుకుంది. సంక్రాంతి పండుగ రోజున పిల్లలతో కలిసి గాలిపటాలు ఎగురవేస్తుండగా భవనం పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాధవ రావు అనే వ్యక్తి తన పిల్లలతో కలిసి భవనం పైనుంచి గాలిపటాలు ఎగురువేస్తుండగా కిందపడ్డాడు. వెంటనే అతడి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

**బలగం టీవి, హైదరాబాద్**

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు జగిత్యాల జిల్లా మెట్ పల్లి సబ్ రిజిస్ట్రార్ ఆసిఫోద్దిన్ . ముందుగా వచ్చిన సమాచారం మేరకు ఈ కార్యాలయంలో ఏసీబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించినట్లు ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు. మెట్ పల్లి పట్టణంలో సాయిరాం కాలనీ లోని 266 గజాల స్థలం ను మార్టిగేజ్ చేయడానికి సబ్ రిజిస్ట్రార్ పదివేలు డిమాండ్ చేశాడు సబ్ రిజిస్ట్రార్.. ఈ సమాచారాన్ని స్థల యజమాని ఏసీబీకి సమాచారం అందించాడు.. దీంతో మొదటి విడతలో రూ. 5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ ను పట్టుకున్నారు. అలాగే ఔట్ సోర్సింగ్ అటెండర్ బాణోతు రవి కుమార్, డాక్యుమెంట్ రైటర్ అసిస్టెంట్ ఆర్మూర్ రవిని అదుపులోకి తీసుకున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## తుపాకుల విక్రయిస్తున్న ముఠా అరెస్టు

**బలగం టీవి, హైదరాబాద్**

తుపాకులు విక్రయించేందుకు వచ్చిన ముఠాను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. ముఠా నుంచి మూడు తుపాకులతో పాటు పది బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ కు చెందిన ముఠాగా పోలీసులు గుర్తించారు. తుపాకుల విక్రయించేందుకు ముఠాకు సూత్రధారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ముఠా సభ్యులు ఎవరి కోసం గన్స్ తీసుకొచ్చారు..గన్స్ కోసం ఎవరైనా ఈ ముఠాని సంప్రదించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


# పుప్పాలగూడలో జంట హత్యలు



**బలగం టీవి, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఓ జంటను దారుణంగా హతమార్చారు. అయితే ఈ కేసులో ట్విస్ట్ బయటపడింది. మృతురాలి రెండో ప్రియుడే వారిని మట్టుబెట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది. వివరాల్లోకి వెళ్తే.. పుప్పాలగూడలోని అనంతపద్మనాభ స్వామి ఆలయ సమీపంలోని గుట్టపై కొంతమంది పతంగులు ఎగురవేయాడానికి వెళ్లారు. ఈ క్రమంలో మృతదేహాలను గుర్తించారు. గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. అయితే మృతురాలి రెండో ప్రియుడే వారిని మట్టుబెట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది. జంట హత్యలకు పాల్పడిన నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. హత్యకు గురైన యువకుడిని మధ్యప్రదేశ్‌కు చెందిన అంకిత్ సాకేత్‌గా, యువతిని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిందుగా గుర్తించారు. వివాహేతర సంబంధాల నేపథ్యంలో జంట హత్యలు జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. నానక్‌రామ్‌గూడలో ఉంటున్న అంకిత్‌కు ఎల్బీనగర్‌లో ఉంటున్న బిందుకు కొన్నేండ్ల క్రితం ఏర్పడిన పరిచయం, వివాహేతర సంబంధానికి దారి తీసింది. బిందుకు పెళ్లై ముగ్గురు పిల్లలు ఉన్నప్పటికీ.. అంకిత్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ, మరో యువకుడితో ఎఫైర్ పెట్టుకున్నట్టు తెలిసింది. ఈనెల 3న ఇంటి నుండి వెళ్లిపోయిన బిందు.. సాకేత్ వద్దకు చేరుకుంది. తన భార్య బిందు అదృశ్యమైనట్లు భర్త జనవరి 4న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే సాకేత్, బిందు కలిసి.. 12న పుప్పాలగూడ గుట్ట వద్దకు వెళ్లారని... ఈ విషయం తెలుసుకున్న బిందు రెండో ప్రియుడు.. పుప్పాలగూడ గుట్ట వద్దకు చేరుకుని.. బిందు సాకేత్‌తో ఏకాంతంగా ఉండటాన్ని జీర్ణించుకోలేక ఇద్దరిని కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపాడని తెలుస్తోంది. అనంతరం బండరాళ్లతో మోది అటు నుంచి పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి ఆచూకీ కోసం మూడు బృందాలతో పోలీసులు గాలిస్తున్నారు.

# భారత్‌కు మెటా క్షమాపణలు




**బలగం టీవి, హైదరాబాద్**

భారత ప్రభుత్వానికి 'మెటా ఇండియా' క్షమాపణలు చెప్పింది. భారత్‌లో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై తమ కంపెనీ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యలు తప్పేనని మెటా ఇండియా అంగీకరించింది. జుకర్‌బర్గ్ అనుకోకుండా చేసిన పొరపాటును క్షమించాలని కోరింది.

కోవిడ్ -19 మహమ్మారిని నిర్వహించడంలో భారత ప్రభుత్వం విఫలమైందని జుకర్‌బర్గ్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో అన్నారు. దాంతో ప్రస్తుత ప్రభుత్వం 2024 ఎన్నికల్లో విజయం సాధించబోదని చెప్పారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక ఈ అంశంపై అప్పట్లో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందిస్తూ మార్క్ జూకర్‌బర్గ్ మాటలు తప్పని రుజువైందన్నారు. ప్రజలు తమ పార్టీకే స్పష్టమైన మెజార్టీ అందించారని చెప్పారు. జూకర్‌బర్గ్ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు.కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీకి నేతృత్వం వహిస్తున్న డాక్టర్ దూబే ప్రజాస్వామ్య దేశంలో ఖచ్చితమైన సమాచారం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. 'ఈ తప్పుడు సమాచారాన్ని వ్యాపింప చేసినందుకు కమిటీ మెటాపై చర్య తీసుకోవాలని చూస్తుంది. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా తప్పుడు సమాచారం దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. ఈ పొరపాటుకు ఆ సంస్థ భారత పార్లమెంటుకు, ఇక్కడి ప్రజలకు క్షమాపణలు చెప్పాలి' అని దూబే అన్నారు. ఈ వ్యవహారంపై మెటా



# కొట్టుకున్న మోహన్ బాబు, మనోజ్ బౌన్సర్లు

**బలగం టీవి, తిరుపతి**

తిరుపతిలో ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబుకు చెందిన యూనివర్శిటీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యూనివర్శిటీ వద్దకు వెళ్లేందుకు మంచు మనోజ్ యత్నించగా ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. తన తాత, నానమ్మ సమాధులను చూసేందుకు తనకు ఎవరి అనుమతి కావాలంటూ మనోజ్ ప్రశ్నించారు. కోర్టు ఆర్డర్ నేపథ్యంలో యూనివర్శిటీ లోపలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మోహన్ బాబు బౌన్సర్లతో మనోజ్ బౌన్సర్లు గొడవపడ్డారు. ఇరు వర్గాల బౌన్సర్లు ఒకరినొకరు కొట్టుకున్నారు. రాళ్లు రువ్వుకున్నారు. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. తనకు గొడవ చేసే ఉద్దేశం లేదని... అనవసరంగా ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని మనోజ్ ప్రశ్నించారు. లోపలకు పంపిస్తే సమాధులకు దండం పెట్టుకుని వచ్చేస్తానని చెప్పారు. ఉద్రిక్తతల మద్యే పోలీసులు మనోజ్ ను, ఆయన భార్య మౌనికను లోపలకు పంపించారు. సమాధులకు దండం పెట్టుకున్న మనోజ్ దంపతులు యూనివర్శిటీ నుంచి బయటకు వచ్చేశారు.

## తెలంగాణ హైకోర్టు
## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్

**బలగం టీవి, హైదరాబాద్**



తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌కు సీజేగా బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే బాంబే హైకోర్టు సీజేగా బదిలీ అయ్యారు. 1964 జూన్ 21న జన్మించిన జస్టిస్ సుజయ్‌పాల్ బీకాం, ఎంఎ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు సేవలు అందించిన ఆయన 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుతో 2024 మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయన హైకోర్టు సీజేగా నియమితులయ్యారు.

## త్వరలోనే ఈ-కామర్స్ గోదాముల్లో సోదాలు

- **హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్**

**బలగం టీవి, హైదరాబాద్**



రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో విచ్చలవిడిగా లభ్యమవుతున్న చైనీస్ మాంజాపై నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. చైనీస్ మాంజాను స్థానికంగా తయారు చేయడం వల్లే పెద్ద మొత్తంలో లభ్యమవుతుందని తెలిపారు. ఈ -కామర్స్ వెబ్‌సైట్‌లో ఆర్డర్ చేసుకుంటే ఇంటికే వస్తుందన్నారు. ఈ క్రమంలో త్వరలోనే ఈ-కామర్స్ గోదాములపై కూడా సోదాలు చేస్తామని సీపీ తెలిపారు. గోదాముల నిర్వాహకులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి.. కీలక సూచనలే జారీ చేస్తామన్నారు. చైనీస్ మాంజా వినియోగాన్ని అరికట్టడంలో ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే సాధ్యమవుతుందని సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.



# న్యూఢిల్లీ స్థానానికి కేజ్రీవాల్ నామినేషన్

**బలగం టీవి, హైదరాబాద్**

వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. తాజాగా మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి కన్నౌట్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాన్ని ఆయన సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రిటర్నింగ్ ఆఫీస్‌కు ర్యాలీగా వెళ్లి.. అక్కడ నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాగా ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి నోటీసులు

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం(నేడు) విచారణకు రావాలని కౌశిక్ రెడ్డిని ఆదేశించారు. అయితే గురువారం కరీంనగర్ కోర్టుకు హాజరుకావాల్సి ఉందని, అందువల్ల ఎల్లుండి విచారణకు హాజరవుతానని కౌశిక్ రెడ్డి తెలిపారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కౌశిక్ రెడ్డిపై గతంలో కేసు నమోదైంది. గతనెల 4న తన ఫోన్ ట్యాప్ అవుతుందని కౌషిక్ రెడ్డి బంజారాహిల్స్ పీఎస్‌కి వచ్చారు. అదే సమయంలో బయటకు వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ వాహనాన్ని అడ్డుకుని తన అనుచరులతో కలిసి పీఎస్‌లో హల్‌చల్ చేశారు. తన విధులు అడ్డుకోవడమే కాకుండా బెదిరింపులకు దిగిన వ్యవహారంపై ఇన్‌స్పెక్టర్ రాఘువేందర్ ఫిర్యాదుపై అదే పీఎస్‌లో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు అధికారిగా మాసబ్ ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురాంను వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ నియమించారు. ఇందులో భాగంగా మాసబ్ ట్యాంక్ పోలీసులు కౌసిక్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు.



# క్రికెట్ కిట్టు పంపిణీ

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామ బిజెపి శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజున క్రీడాకారులకు క్రికెట్ కిట్టు పంపిణీ చేశారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ క్రికెట్ కిట్టు అందజేయగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బిజెపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు సింగరి వెంకటేష్, ఎడపల్లి చంద్రయ్య, నాయకులు మినుకుల శ్రీనివాస్, గోగురి దామోదర్ రెడ్డి, రేండ్ల మహిపాల్, బుర్ర జలంధర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూ ఆక్రమణలకు పాల్పడితే స్వచ్ఛందంగా అప్పగించాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదురు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఈ భూములను పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని, పేద ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వినియోగిస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం లో ప్రభుత్వ భూమి అప్పగింత పై ఎస్పీ అఖిల్ మహజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన కూనవేణి నర్సయ్య గ్రామ సర్వే నెంబర్ 464/4లో గల 5 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసుకుని సాగు చేసుకుంటున్నాడని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని అన్నారు . తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన బుస్స లింగం గ్రామ సర్వే నెంబర్ 365/అ/2లో ఎకరం ప్రభుత్వ భూమిని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని అన్నారు .2018 నుంచి 2023 వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉంటూ రైతు బంధు, పీఎం కిసాన్ మొదలైన ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందినందుకు ఆ సొమ్ము రికవరి కోసం డిమాండ్ నోటీసు జారీ చేస్తామని అన్నారు . ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## సంక్రాంతిని పురస్కరించుకొని

# తంగళ్ళపల్లిలో క్రీడా ఉత్సవాలు

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

సంక్రాంతి సందర్భంగా తంగళ్ళపల్లి మండలంలో ఆటల పోటీలను యువకులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో తంగళ్ళపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 కడారి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా విన్నర్ గా ఎగుర్ల 11, రన్నర్ గా రాపెల్లి రైడర్స్ నిలిచారు. గెలుపొందిన వారికి మండల నాయకులు బహుమతులు అందజేశారు. అలాగే మండేపల్లిలో మండేపల్లి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ను జిల్లా కాంగ్రెస్ ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి వెన్నమని ప్రశాంత్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆసాని మైపాల్ రెడ్డి ప్రారంభించారు. అలాగే ఇందిరమ్మ కాలనీ (టెక్స్టైల్ పార్క్) లో కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ చోటు ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీ నిర్వహించగా మొదటి బహుమతి సామల ప్రశాంత్, రెండవ బహుమతి సుశాంత్ టీం గెలుచుకున్నారని తెలిపారు. ఇందులో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్ (టోని), బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గజబింకర్ రాజన్న, పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, మాజీ ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఎగుర్ల కర్ణాకర్, మాజీ వార్డు సభ్యులు రెడ్డి పర్శరాములు, బెంద్రం పవన్ రెడ్డి, నేరెళ్ళ రాజు, ఆసాని శ్రీకాంత్ రెడ్డి, క్రీడాకారులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకూ రైతు భరోసా

- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు చేరేలా పటిష్ట కార్యాచరణ..
- జనవరి 26 నుంచి 4 నూతన పథకాల అమలు
- జనవరి 16 నుంచి జనవరి 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పట్టిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డుల జారీ, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షి సమావేశం నిర్వహించారు.

జనవరి 26 నుంచి నూతనంగా 4 ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు సంబంధించి పాటించాల్సిన విధానాల పై సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్ఫరెన్స్ లో తీసుకున్న నిర్ణయాలు, ప్రభుత్వం జారీ చేసిన గైడ్ లైన్స్ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రైతు భరోసా కు సంబంధించి అధికారులు వ్యవసాయ యోగ్యమైన భూమో కాదా అని మాత్రమే పరిశీలించాలని, భూ భారతి (ధరణి) నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి సదరు లబ్దిదారులను తొలగించాలని అన్నారు.రైతు భరోసా కింద ఏడాదికి ప్రతి ఎకరాకు 12 వేల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు పంట వేసినా, వేయక పోయినా రైతు భరోసా అందుతుందని, రైతులలో అనవసర అపోహలు ప్రబల కుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.

ప్రతి మండలంలోని తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్లు, మైనింగ్ అధికారులు సంయుక్తంగా పని చేసి పట్టా దార్ పాస్ పుస్తకాల డేటా, గూగల్ మ్యాప్ , రెవెన్యూ మ్యాప్ వారీగా పరిశీలించాలని అన్నారు. సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ చేసిన భూములను చెరువులు, కుంటలలో ఉన్న భూములను డి మార్కింగ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

జిల్లా పంచాయతీ అధికారి, పరిశ్రమల అధికారి, ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు సర్వే నెంబర్ల వారీగా అవ్వది భూములను డి మార్కింగ్ చేయాలని, పట్టణాలకు సమీపంలో పరిశ్రమలకు భూములు (రైస్ మిల్ పెట్రోల్ బంక్ టెక్స్టైల్ పార్క్ ఆహార శుద్ధి పరిశ్రమ), నాలా కన్వర్షన్ జరిగిన భూములు, లేఔట్ ఉన్న భూములు, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు భూముల వివరాలు రైతు భరోసా నుంచి తొలగించాలని అన్నారు. రోడ్ల నిర్మాణానికి జరిగిన భూ సేకరణ భూములు, మైనింగ్ కోసం అందించిన భూముల వివరాలను రైతు భరోసా నుంచి మినహాయించాలని, అర్హులైన ఏ ఒక్కరికి పథకం అందకుండా ఉండవద్దని, అదే సమయంలో అనర్హులకు ఎవరికి ప్రభుత్వ సహాయం ఆందవద్దని అన్నారు.

భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12,000 రూపాయ లకు రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించిందని, 2023-24 సంవత్సరానికి 20 రోజులు పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఈ పథకం కుటుంబం యూనిట్ గా అందించడం జరుగుతుందని, వ్యక్తిగతంగా అందించే పథకం కాదని అన్నారు.

ప్రతి రెవెన్యూ గ్రామాన్ని జీపి వారిగా మ్యాప్ చేయాలని అన్నారు.జిల్లాలో 20 రోజులు ఉపాధి హామీ కూలీలుగా పని చేసిన కార్మికుల జాబితాను తీసుకొని ఆధార్ కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమిలేని కుటుంబాలను ఎంపిక చేయాలని,గ్రామ సభలో ఎంపిక చేసిన జాబితా పై ఏవైనా అభ్యంతరాలు వస్తే ఎంపిడీఓ 10 రోజుల లోగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సామాజిక ఆర్థిక సర్వే కింద మన సిరిసిల్ల జిల్లాలో 9వేల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు లేదని తేలిందని, మండలాలలో ఎంపీడీవోలు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్ నూతన రేషన్ కార్డుల జారీ పర్యవేక్షించాలని అన్నారు. గ్రామ లేదా వార్డు సభల ద్వారా అర్హులైన జాబితాన్ని ఆమోదింప చేసుకొని రేషన్ కార్డులను గణతంత్ర దినోత్సవ సందర్భంగా నూతన రేషన్ కార్డుల ప్రోసిడింగ్స్ పంపిణీ చేయాలని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిర్వహించిన సర్వేలో భూములు కొన్న అత్యంత పేదలకు మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో స్క్రూటినీ నిర్వహించి 13.93 లక్షల దరఖాస్తులను మొదటి విడతలో పరిశీలనకు జిల్లాలకు అందిస్తున్నారని అన్నారు . రాజన్న సిరిసిల్ల జిల్లాలకు వచ్చిన దరఖాస్తులను మరొకసారి చెక్ చేసుకోని, గ్రామాల వారీగా అర్హులను ఎంపిక చేసుకొని జిల్లా ఇంఛార్జి మంత్రి ఆమోదంతో ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు.

జనవరి 16 నుంచి జనవరి 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన చేసి జనవరి 21 నుంచి జనవరి 24 వరకు గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న 4 కార్యక్రమాల మార్గ దర్శకాలు, ఉద్దేశం ప్రజలకు వివరిస్తూ పథకాల అర్హుల జాబితాను ప్రజలందరికీ తెలిసేలా ప్రదర్శించాలని, ప్రజల నుంచి వచ్చే అభ్యంత రాలను పరిష్కరించిన తర్వాత తుది జాబితా తయారు చేసే జనవరి 26 నుంచి 4 పథకాల అమలును ప్రారంభించాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డి వో శేషాద్రి, డిపివో అఫ్జలి బేగం, మండల ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు తహసిల్దార్లు, వ్యవసాయ ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుపాకీ ఎక్కుపెట్టినా....అసెంబ్లీలో గళం విప్పినా.. ప్రజల పక్షమే...

- కామ్రేడ్ అమృత లాల్ శుక్ల 34వ వర్ధంతి

**బలగం టీవీ , తంగళ్లపల్లి**



చరిత్ర లో ఎందరు మహనీయులు తమ అనుభవాలు జీవిత ఆచరణను భవిష్యత్ తరాలకు పాఠాలుగా అందించి పోతారు. అట్లా చరిత్రను తరచి చూసినప్పుడు ఎందరో మహనీయుల జీవితాలు కనిపిస్తాయి. మట్టి మనుషులను పోరాట యోధులుగా తీర్చిదిద్ది ముందుకు నడిపిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అనేక అనుభవాలను అందించింది.నిస్వార్ధమైన నాయకత్వాన్ని అందించిన అనుభవాలు చరిత్రలు ఎన్నో కనిపిస్తాయి.ఉపాధ్యాయులుగా ప్రారంభమై సాయుధుడై పోరాడిన కమ్యూనిస్టు యోదుడు కామ్రేడ్ అమృత లాల్ శుక్ల. సిరిసిల్లలో 1935లో నిర్వహించిన నాలుగవ ఆంధ్ర మహాసభ అప్పటి సిరిసిల్ల పాత తాలూకా పరిధిలో తీవ్ర ప్రభావాన్ని చూపింది.మహాసభల నిర్వహణ కోసం అప్పట్లో కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతి రెడ్డి, గడ్డం తిరుపతి రెడ్డి ల తోపాటు అమృత లాల్ శుక్ల కీలకంగా పనిచేశారు. తెలంగాణ సాయుధ పోరాటం రూపం తీసుకోవడానికి మహాసభలు ప్రత్యేకంగా పనిచేసాయని చరిత్ర గుర్తు చేస్తుంది.అప్పటికే ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కామ్రేడ్ అమృత లాల్ శుక్ల కాల ప్రవాహంలో

పోరాటానికి నేతృత్వం వహించారు. అప్పట్లో మానాల ప్రాంతంలో నిర్వహించిన గేరిల్ల శిక్షణ కేంద్రంలో ఎంతో మంది యువకులకు శిక్షణ ఇవ్వడంలో కీలకంగా పని చేశారు. అప్పటి ఉమ్మడి సిరిసిల్ల తాలూకా పరిధిలోని అనేక గ్రామాలలో ఎక్కడ దొరల దౌర్జన్యం జరిగిన అక్కడ అమృత లాల్ శుక్ల ప్రజల ప్రతిఘటన ఉండేది. కమ్యూనిస్టు పార్టీ విస్తరణ కోసం శుక్ల ప్రజలతో మమేకమై పనిచేసిన తీరును ఇప్పటికీ చెరిగిపోని చరిత్ర. ఓకే తుపాకి గుండుతో ఇద్దరు రజాకార్ల మూకలను నేలకుల్చిన అమృతలాల్ శుక్ల సాహసాలను రుద్రంగి ప్రజలు గుర్తు చేస్తూనే ఉంటారు. అప్పట్లో అది ఎంతోమంది యువకులకు ప్రేరణ అందించిన ఘటన. సాయుధ పోరాట విరమణ అనంతరం సిరిసిల్ల నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. శాసన సభలోనూ ప్రజా సమస్యలపై తన గళం వినిపించారు. తుది శ్వాస విడిచే వరకు ప్రజా సమస్యలపై స్పందిస్తూ తుది శ్వాస వరకు కమ్యూనిస్టు గాని జీవించారు. ఎన్నో మానవీయ విలువలను నేర్పించిన అమృత లాల్ శుక్ల అస్తమించి 34 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ ఆయన జీవితం నిత్యం స్ఫూర్తి దాయకమే సిరిసిల్ల ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. తమ చిహ్నంగా మానేరువాగులో బ్రిడ్జి దగ్గర శుక్ల స్థూపం లో తన ఆశయాలు త్యాగాలను స్మరించుకుంటారు.

# భారత్ రికార్డు విజయం

## భారత్ స్కోరు 435/5.. ఐర్లాండ్‌పై 304 పరుగుల తేడాతో ఘన విజయం

- శతకాలు బాదిత ఇద్దరు బ్యాటర్లు
- స్మృతి మంధాన ఫాస్టెస్ట్ సెంచరీ
- సిరీస్ కైవసం చేసుకున్న భారత్



**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా – ఐర్లాండ్ మహిళా జట్ల మధ్య జరుగుతోన్న మూడో వన్డేలో భారత జట్టు రికార్డు సృష్టించింది. భారత వన్డే చరిత్రలోనే రికార్డు స్కోరు 435 పరుగులు సాధించింది. అనంతరం బౌలింగ్‌లోనూ విజృంభించడంతో ఐర్లాండ్‌పై 304 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది.

టాస్ నెగ్గి బ్యాటింగ్ కు దిగిన టీమిండియా తొలిసారి వన్డేల్లో 400కిపైగా స్కోర్ చేసింది . కెప్టెన్ స్మృతి మంధాన ( 80 బంతుల్లో 135 – 12 ఫోర్లు, 7 సిక్స్‌లు), మరో ఓపెనర్ ప్రతీకా రావల్ ( 129 బంతుల్లో 154 – 20 ఫోర్లు, ఒక సిక్స్) సెంచరీలతో అద్భుతంగా చెలరేగారు. వన్‌డౌన్‌లో దిగిన రిచా ఘోష్ ( 10 ఫోర్లు, ఒక సిక్స్ సాయంతో 59) దూకుడు ప్రదర్శన చేసింది. దీంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 435 పరుగులు చేసింది.

సాధరణంగా ఇప్పటి వరకు జరిగిన క్రికెట్ లో భారత మహిళా జట్టుకు 370/5 అత్యధిక స్కోరుగా ఉంది. అది కూడా ఐర్లాండ్ జట్టుపైనే రీసెంట్ గానే జనవరి 12న చేసింది. ఆ రికార్డు నమోదై మూడు రోజులు కూడా కాలేదు.. అంతలోనే ఇప్పుడు మరోసారి ఆ రికార్డును బ్రేక్ చేసి 435/5 చేసింది. మొత్తం ప్రపంచ వన్డే క్రికెట్ లో ఇది నాలుగో అత్యధిక స్కోర్. ఇక 2018లో ఐర్లాండ్ జట్టుపైనే న్యూజిలాండ్ కూడా 491/4 చేసింది. ఇది వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యధిక స్కోర్.

మొదటి బంతి నుంచే దూకుడు ప్రదర్శించిన స్మృతి మంధాన కెరీర్‌లో పదో సెంచరీని కంప్లీట్ చేసింది. ఈ క్రమంలో భారత్ తరపున ఫాస్టెస్ట్ సెంచరీని బాదిన బ్యాటర్‌గా రికార్డుకెక్కింది. 70 బంతుల్లోనే ఈ మార్క్ టచ్ చేసింది. మంధానకు ఇది వరుసగా రెండో సెంచరీ. ఇక ఇదే మ్యాచ్ లో ప్రతీకా రావల్ కూడా శతకం బాది.. కెరీర్ లో తన తొలి సెంచరీని సాధించింది. 100 బంతుల్లో దీన్ని సాధించింది. ఆ తర్వాత మరో 27 బంతుల్లోనే ఇంకో హాఫ్ సెంచరీ కూడా చేసింది. అయితే మొదటి వికెట్‌కు మంధాన – ప్రతీకా రావల్ కలిసి 233 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఇది మహిళల వన్డే హిస్టరీలో ఆరో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యంగా రికార్డుకెక్కింది.

ఇక ఇన్నింగ్స్ లో రిచా ఘోష్ కూడా వీరబాదుడే. ప్రతీకా – రిచా జోడీ కలిసి కేవలం 12 ఓవర్లలోనే 104 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రిచా ఔట్ అయ్యాక.. తేజల్ హసబ్నిస్ (28)తో కలిసి ప్రతీకా మరో 50 పరుగుల పార్ట్నర్ షిప్ నెలకొల్పింది. దీంతో టీమిండియా స్కోరు బోర్డు 400 పరుగులు దాటేసింది. మొత్తంగా 435 చేసింది. ఐర్లాండ్ బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయారు. ఐర్లాండ్ బౌలర్లలో ఓర్లా 2 వికెట్లు పడగొట్టగా .. కెల్లీ, ఫ్రేయా, డెంప్సీ తలో వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం భారీ లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ ఏ మాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే ఓపెనర్ లూయిస్ (1 పరుగులు) వికెట్ కోల్పోయింది. ఇక వన్‌డౌన్‌లో దిగిన రెలీ (0) ఆ తర్వాతి ఓవర్లో పెవిలియన్ చేరింది. మరో ఓపెనర్ సారా ఫోర్బ్స్ మాత్రం ఉన్నంతసేపు కాస్త నిలకడగా ఆడింది. ఓర్లా (36 పరుగులు)తో కలిసి మూడో వికెట్‌కు 64 పరుగులు జోడించింది. మరోసారి భారత బౌలర్లు విజృంభించారు. ఓర్లాతోపాటు లారా డెలానీ (10 పరుగులు), లేహ్ పాల్ (15 పరుగులు), కెల్లీ (2 పరుగులు) పెద్దగా ప్రభావం చూపించలేదు. ఐర్లాండ్ 131 పరుగులకే ఆలౌటైంది. దాంతో టీమ్ఇండియా 304 పరుగుల తేడాతో విజయం సాధించింది.

# జోకోవిచ్ సరికొత్త రికార్డు



**బలగం టీవీ, హైదరాబాద్**

టెన్నిస్ స్టార్ నోవాక్ జోకోవిచ్ పరికొత్త రికార్డు క్రియేట్ చేశాడు. ఓపెన్ ఎరాలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ మ్యాచ్‌లు ఆడిన ఘనతను జోకోవిచ్ దక్కించుకున్నాడు. ఇప్పటి వరకు రోజర్ ఫెదరర్ పేరిట ఉన్న రికార్డును అతను బ్రేక్ చేశాడు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో మూడవ రౌండ్‌లోకి ప్రవేశించిన జోకోవిచ్ ఈ కొత్త మైలురాయి చేరుకున్నాడు. గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీల్లో ఇప్పటి వరకు జోకోవిచ్ 430 మ్యాచ్‌లను గెలుచుకున్నాడు. ఆ జాబితాలో రోజర్ ఫెదరర్ 429 మ్యాచ్‌లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఆల్‌టైం రికార్డును బ్రేక్ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు జోకోవిచ్ చెప్పాడు. టెన్నిస్‌ను ప్రేమిస్తాను, పోటీలను ప్రేమిస్తాను, ప్రతిసారి బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తాను, 20 ఏళ్లుగా గ్రాండ్‌స్లామ్ పోటీల్లో ఆడుతున్నానని, ఓడినా..గెలిచినా.. పూర్తిగా ఆటను ఆస్వాదిస్తానన్నాడు.



# నేను సేఫ్‌గా ఉండాలంటే అదే కరెక్ట్


- మాజీ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి ఎంతటి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుందో తెలిసిందే. అతడు ఎక్కడికి వెళ్లినా, కనిపించినా.. ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు ఫ్యాన్స్ ఉత్సాహం చూపిస్తూ ఎగబడతారు. ఇంకా చెప్పాలంటే అతడి లేడీ ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఎక్కువే. అయితే మరి లేడీ ఫ్యాన్స్ తన చుట్టూ ఉంటే ఎలా ప్రవర్తిస్తాడో ఆయన స్వయంగా చెప్పాడు. తాజాగా ఓ ప్రమోషనల్ ఈవెంట్ కు హాజరైన ధోనీని.. "మీ చుట్టూ మహిళా ఫ్యాన్స్ ఉంటే మీరేం చేస్తారు? అప్పుడు మీ భార్య మీ పక్కనే ఉండాలని మీరు అనుకుంటారా?" అని అడిగారు. దానికి మహీ సమాధానమిస్తూ.. "ఆమె ఎప్పుడూ నా పక్కనే ఉంటుంది. ఒకవేళ తను నా పక్కనే లేకపోయినా.. ఆమె నా పక్కనే ఉన్నట్లు భావిస్తాను. అదే మంచిది కూడా. నేను సేఫ్ గా ఉండాలంటే అలా భావించడమే కరెక్ట్". అని నవ్వుతూ చెప్పుకొచ్చాడు.

# సంక్రాంతికి వస్తున్నాంకు అదిరిపోయే ఓపెనింగ్స్..!

**బలగం టీవీ, హైదరాబాద్**




నటుడు వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కి సంక్రాంతి కానుకగా మంగళవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైన సినిమా సంక్రాంతికి వస్తున్నాం. ఈ చిత్రం తొలి రోజు వరల్డ్ వైడ్‌గా రూ. 45కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ మేరకు మూవీ టీమ్ ప్రకటించింది. వెంకీకి ఇవే ఆల్‌టైమ్ కెరీర్ హైయెస్ట్ ఓపెనింగ్ కలెక్షన్స్ అని తెలిపింది. ఇక ఈ సినిమాకు భీమ్స్ సంగీతం అందించగా ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటించారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు, శిరీష్ కలిసి దీనిని నిర్మించారు.

రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ఈ సినిమా మంచి కలెక్షన్లను సాధించిందని తాజాగా మూవీ టీమ్ వెల్లడించింది. ఓవర్సీస్‌లో తొలిరోజు ఈ సినిమా సుమారు 7 లక్షల డాలర్లను వసూలు చేసిందని మూవీ టీమ్ ఓ స్పెషల్ పోస్టర్ ద్వారా వెల్లడించింది.




# డాకు మహారాజ్ మేకింగ్ వీడియో విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం డాకు మహారాజ్ .బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్‌తో థియేటర్లలో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా కోసం బాలయ్య ఎంత కష్టపడ్డాడో తెలుపుతూ చిత్రబృందం మేకింగ్ వీడియోను విడుదల చేసింది.

ఆదివారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీకి మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.92 కోట్లకు పైగా గ్రాస్ వచ్చినట్లు చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తాజాగా ప్రకటించింది. "ఈ సంక్రాంతికి బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'డాకు మహారాజ్' వరల్డ్‌వైడ్‌గా ప్రేక్షకులను అలరిస్తోంది. ఈ సంక్రాంతికి రాజు డాకు మహారాజు. ఈ మహారాజు బాక్సాఫీస్, హృదయాలను ఒకేలా శాసిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో నిండిన పరిపూర్ణమైన సంక్రాంతి ట్రీట్!" అని నిర్మాణ సంస్థ పేర్కొంది.

# విజయ్ దేవరకొండ, తిలక్ వర్మ సెల్ఫీ....

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు విజయ్ దేవరకొండ, టీమ్ ఇండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ ఓ సెల్ఫీ దిగారు. తాజాగా వీరిద్దరి కలిసి ఒకే ఫ్లైట్‌లో ప్రయాణిస్తుండగా.. విజయ్‌ని చూసిన తిలక్ వర్మ అతడితో కలిసి సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. మిమ్మల్ని ఫ్లైట్‌లో కలుసుకోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది అన్న. మిమ్మల్ని కలుసుకోవడం నా అదృష్టం. మళ్లీ కలుద్దాం. అంటూ తిలక్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకోచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్‌గా మారింది.

